సాక్షి
విశాఖపట్నం

శుక్రవారం । 14 । జూలై । 2023



లిఫ్టర్ పల్లవికి స్వర్ణం

కామన్‌వెల్త్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్ షిప్‌లో నగర వెయిట్‌లిఫ్టర్ పల్లవి స్వర్ణ పతకాన్ని సాధించింది. IIలో



'స్లమ్ డాగ్ హస్బెండ్' నవ్విస్తాడు

స్లమ్ డాగ్ హస్బెండ్ చిత్రం ప్రేక్షకులు చూస్తున్నంత సేపు నవ్వుతూ.. ఎంజాయ్ చేస్తారని హీరో సంజయ్‌రావు అన్నారు. IIలో

ప్రతీ మొక్క ఆయన నేస్తమే..



విద్యార్థిగా ఏయూలో చదువుకునే సమయంలో చుట్టూ ఉన్న ప్రకృతితో, పక్షులతో ఏర్పడిన విడదీయరాని అనుబంధం.. ఆ సమయంలో మనసులో నాటుకున్న చిన్న ఆలోచన పెదవాల్తేరులోని జీవవైవిధ్య ఉద్యానవనం అభివృద్ధికి నాంది అయింది. IIలో

● అదరగొట్టిన జ్యోతి



విశాఖ స్పోర్ట్స్ : ఆసియన్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్-2023 100 మీటర్ల వుమెన్ హార్డిల్స్‌లో విశాఖకు చెందిన ఎర్రాజీ జ్యోతి సత్తా చాటింది. గురువారం బ్యాంకాక్‌లో జరిగిన వుమెన్ 100 మీటర్ల హార్డిల్స్‌ను 13.09 సెకన్లలోనే పూర్తి చేసి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. విశాఖ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసింది. - వివరాలు స్పోర్ట్స్‌పేజీలో..

చెరువులకు కొత్త కళ!

- రూ.12.48 కోట్లతో 9 చెరువుల అభివృద్ధి
- అమృత్ 2.0 కింద సుందరంగా తీర్చిదిద్దనున్న ప్రభుత్వం
- పర్యాటకంగా అభివృద్ధికి చర్యలు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) పరిధిలోని చెరువులు కొత్త కళ సంతరించుకోనున్నాయి. వీటిని సుందరంగా తీర్చిదిద్ది, ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించేందుకు ప్రభుత్వం సంకల్పించింది. అమృత్ 2.0 కార్యక్రమం కింద చెరువులను పర్యాటక ప్రదేశాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టింది. మొత్తం రూ.12.48 కోట్లతో తొమ్మిది చెరువుల అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. ప్రధానంగా నగరంలో పెరిగిపోతున్న కాలుష్యాన్ని తగ్గించేందుకు అనుగుణంగా ఇక్కడ చెట్లను పెంచడంతో పాటు నగర ప్రజలు సేద తీరేందుకు అనుగుణంగా వీటిని తీర్చిదిద్దనున్నారు. చెరువుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి, పూడికతీత పనులను కూడా చేపట్టనున్నారు. అదేవిధంగా చెరువు చుట్టూ కంచె ఏర్పాటు చేసి.. అక్కడ వాకింగ్ ట్రాక్‌ను కూడా అభివృద్ధి చేయనున్నారు. తద్వారా చెరువులో నీటి లభ్యత పెరగడంతో పాటు భూగర్భ నీటిమట్టం పెరుగుదలకు కూడా దోహదం చేయనుంది. మొత్తంగా నగర ప్రజలు సేదతీరేందుకు ఆహ్లాదకరంగా చెరువుల రూపురేఖలు మారనున్నాయి.

రూ. 12.48 కోట్లతో...!

గత కొన్ని సంవత్సరాలుగా చెరువులను పట్టించుకోకపోవడంతో చెత్తాచెదారంతో నిండుకుంటున్నాయి. పూడిక పేరుకుపోయి నీటి నిల్వ సామర్థ్యం కూడా తగ్గిపోతోంది. చెత్తాచెదారం వల్ల దుర్గంధం వెదజల్లడంతో చెరువుల వద్ద సేదతీరే పరిస్థితి ఉండడం లేదు. మరోవైపు చెరువుల ఆక్రమణలు పెరుగుతున్నాయి. చెరువును పూడ్చివేసి మరీ నిర్మాణాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో వీటిని అరికట్టడంతో పాటు చెరువులను సుందరంగా తీర్చిదిద్ది.. అక్కడ ప్రతీ రోజూ నగర ప్రజలు వాకింగ్ చేసుకోవడంతో పాటు పిల్లలు ఆటలు ఆడుకునేందుకు అనువుగా అభివృద్ధి చేయనున్నారు. విశాఖ జిల్లాలో మొత్తం రూ.12.48 కోట్ల వ్యయంతో 111.7 ఎకరాల్లో విస్తరించి ఉన్న తొమ్మిది చెరువులను అభివృద్ధి చేయనున్నారు. అమృత్ 2.0 పథకం కింద అభివృద్ధి చేయనున్న ఈ చెరువులతో వాతావరణ సమతుల్యం దెబ్బతినకుండా ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



ఎండాడలోని పాకచెరువు

అభివృద్ధి చేయనున్న చెరువులు

పేరు	విస్తీర్ణం (ఎకరాల్లో)	వ్యయం (రూ.ల్లో)
చిల్లపేట	25	4,78,73,000
క్రాంతినగర్	13.945	2,10,69,006
కొమ్మాది చెరువు	9.25	1,88,40,888
నటయ్యపాలెం	10.09	1,22,88,023
నరవ	20	70,57,934
లంకెలపాలెం	2.9	61,61,740
జగ్గరాజుపాలెం	14	52,06,516
చినగంట్యాడ	1.93	34,41,042
మింది	14.6	29,16,534
మొత్తం	111.715	12,48,54,795

ఇవీ కల్పించనున్న సౌకర్యాలు!

- చెరువుల అభివృద్ధిలో భాగంగా చెరువు చుట్టూ ఫెన్సింగ్ వేయడంతో పాటు గట్టును అభివృద్ధి చేస్తారు.
- వాకర్స్ కోసం ప్రత్యేకంగా వాకింగ్ ట్రాక్‌ను అభివృద్ధి చేయనున్నారు.
- పిల్లలు ఆడుకునేందుకు వివిధ క్రీడలకు సంబంధించిన సామగ్రితో పాటు ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేయనున్నారు.
- చెరువులో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి, పూడిక తీసి.. చెరువు చుట్టూ అందమైన మొక్కలను నాటనున్నారు.
- సేద తీరేందుకు బెంచీలను కూడా ఏర్పాటు చేయనున్నారు.

నేటి నుంచి రిజిస్ట్రేషన్లు

- జీవో నంబర్ 301, 388 భూములకు కన్వేయన్స్ డీడ్ అమలు
- 100 గజాల వరకు ఉచితంగా రిజిస్ట్రేషన్: జేసీ విశ్వనాథన్



మహారాణిపేట: జీవో నంబర్ 301, 388 ద్వారా క్రమబద్ధీకరణ పట్టాలు పొందిన భూములకు కన్వేయన్స్ డీడ్ ప్రక్రియ శుక్రవారం నుంచి ప్రారంభమవుతుందని జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ భూముల్లో అభ్యంతరం లేని ఆక్రమణలను క్రమబద్ధీకరణ చేసి.. అర్హులైన లబ్ధిదారులకు ఉచితంగా, మార్కెట్ విలువ చెల్లింపుపై గతంలో క్రమబద్ధీకరణ పట్టాలు అందజేశామన్నారు. జిల్లాలో జీవో నంబర్ 388 కింద 8,401 దరఖాస్తుల్లో 5,890 మంది క్రమబద్ధీకరణ మొత్తం చెల్లించినట్లు చెప్పారు. 5,890 మందిలో 3,435 కేసులు 100 చదరపు గజాల కంటే తక్కువ విస్తీర్ణంలో ఉన్నాయని.. వీటికి లబ్ధిదారులు ఎటువంటి రిజిస్ట్రేషన్ చార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. 100 చదరపు గజాల పైన ఉన్న 2,455 మంది లబ్ధిదారులు గతంలో చెల్లించిన క్రమబద్ధీకరణ ఖర్చుపై 7.5 శాతం రిజిస్ట్రేషన్ చార్జీలు చెల్లించాలన్నారు. జీవో నంబర్ 301 ద్వారా 7,441 దరఖాస్తులు అందాయని, వీటిలో 7,228 దరఖాస్తులకు సంబంధించి క్రమబద్ధీకరణ మొత్తం చెల్లించినట్లు చెప్పారు. వినియోగదారుల రుసుం రూ.500 అందరూ చెల్లించాల్సి ఉంటుందన్నారు. శుక్రవారం నుంచి షెడ్యూల్ ప్రకారం లబ్ధిదారులందరికీ కన్వేయన్స్ డీడ్ అందజేస్తామని.. సంబంధిత తహసీల్దార్లు ఈ ప్రక్రియ అమలు చేస్తారన్నారు. టైటిల్ డీడ్ పట్టాలు పూర్తి అనుభవంతో రిజిస్ట్రేషన్ హక్కులు కలిగి ఉంటాయని.. అవకాశాన్ని లబ్ధిదారులందరూ వినియోగించుకోవాలని సూచించారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి, ఈ సెక్షన్ సూపరింటెంటెండ్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర దినోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు

జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్

మహారాణిపేట: స్వాతంత్య్ర దినోత్సవాన్ని జిల్లాలో ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ కే.ఎస్.విశ్వనాథన్ జిల్లా అధికారులను ఆదేశించారు. ఆగస్టు 15న పోలీస్ బ్యారెక్స్ మైదానంలో స్వాతంత్య్ర దిన వేడుకలను నిర్వహించేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై గురువారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షించి పలు సూచనలు చేశారు. సుశిక్షితులైన పోలీసు, ఎన్‌సీసీ దళాలతో సంప్రదాయ కవాతు ఏర్పాటు చేయాలని పోలీసు శాఖను కోరారు. వేడుకలను తిలకించేందుకు విచ్చేసే ప్రజల కోసం అవసరమైన టెంట్లు, కుర్చీలు ఏర్పాటు చేయాలని, స్వాతంత్య్ర సమరయోధులు, అతిథులకు ఆతిథ్యం కల్పించాలని ఆర్‌డీవో, అర్బన్ తహసీల్దార్‌లకు సూచించారు. జిల్లా ప్రగతికి సంబంధించి సమాచారం సిద్ధం చేయాలని సమాచార శాఖ డీడీకి సూచించారు. పాఠశాల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని డీఈవోకు సూచించారు. వివిధ ప్రభుత్వ శాఖలు తమ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో తీర్చిదిద్దిన శకటాలను ప్రదర్శించాలని, స్టాళ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వివిధ ప్రభుత్వ శాఖలు వ్యవస్థల ద్వారా ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసా పురస్కారాలు అందించేందుకు ప్రతిపాదనలు ఈనెల 31లోప పంపాలని కోరారు. ఈ సమావేశంలో డీఆర్వో ఎస్.శ్రీనివాస మూర్తి, ఆర్డీవో డి.హుస్సైన్ సాహెబ్, డీఆర్‌డీఏ పీడీ శోభారాణి, ,ముఖ్యప్రణాళిక అధికారి శ్రీనివాసరావు, డీఎస్‌వో సూర్యప్రకాశరావు, డీఈవో చంద్రకళ, వివిధ శాఖల అధికారులు, పోలీసులు, ఎన్‌సీసీ అధికారులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

అప్పన్నను దర్శించుకున్న సతీష్ రెడ్డి



సతీష్‌రెడ్డికి ప్రసాదం అందిస్తున్న ఏఈవో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని గురువారం రక్షణ మంత్రిత్వ శాఖ సైంటిఫిక్ అడ్వైజర్ డా.సతీష్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు అంతరాలయంలో స్వామికి పూజలు నిర్వహించారు. గోదాదేవి సన్నిధిలో కుంకుమార్చన నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదాన్ని ఆలయ ఏఈవో భ్రమరాంబ అందజేశారు.

పోలీస్ సిబ్బందికి స్థానచలనం

ఇద్దరు ఏఎస్‌ఐలు, ఆరుగురు హెచ్‌సీలు, 10 మంది పీసీలకు బదిలీ

దొండపర్తి: నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీస్ సిబ్బందికి స్థాన చలనం కలిగిస్తూ పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఫోర్త్ టౌన్ స్టేషన్‌లో ఏఎస్‌ఐగా ఉన్న డి.రామన్నదొరను ఎయిర్‌పోర్ట్ లా అండ్ ఆర్డర్‌కు, పీసీఆర్‌లో ఉన్న ఏఎస్‌ఐ ఎం.కిషోర్‌కుమార్‌ను పీఎం పాలెం లా అండ్ ఆర్డర్‌కు బదిలీ చేశారు. అలాగే ఆరుగురు హెడ్‌కానిస్టేబుళ్లకు, 10 మంది కానిస్టేబుళ్లకు స్థానచలనం కలిగించారు.


ఆర్టీవోగా గొర్లె మనీషా



మనీషాను అభినందిస్తున్న డీటీసీ రాజారత్నం

గోపాలపట్నం: విశాఖ జిల్లా రవాణా అధికారిగా గొర్లె మనీషా గురువారం బాధ్యతలు స్వీకరించారు. 2022లో గ్రూప్-1కి ఎంపికైన ఆమె శిక్షణ అనంతరం ఇక్కడ తొలి పోస్టింగ్ వచ్చింది. ఆమెకు సహచర ఉద్యోగులు అభినందనలు తెలిపారు. ప్రజలకు పారదర్శకంగా అందిస్తానని ఆమె తెలిపారు.

పలు రైళ్ల రీషెడ్యూల్



తాటిచెట్లపాలెం: ఆయా స్టేషన్లలో గురువారం పలు రైళ్లు ఆలస్యంగా బయలుదేరినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. చెన్నై సెంట్రల్ -షాలిమార్ (12842) కోరమండల్ ఎక్స్‌ప్రెస్, హౌరా-సికింద్రాబాద్ (12703) ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్, ఎస్ఎంవీ బెంగళూరు-హౌరా (12864) ఎక్స్‌ప్రెస్, చెన్నై సెంట్రల్ - హౌరా(12840) మెయిల్ ఎక్స్‌ప్రెస్, నాందేడ్- విశాఖపట్నం (20812) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్- భువనేశ్వర్ (17016) విశాఖ ఎక్స్‌ప్రెస్ ఆలస్యంగా బయలుదేరాయి.

సీఎం జగన్‌కు సిరి ధాన్యాల చిత్రపటం బహూకరణ

అల్లిపురం: సిరి ధాన్యాలతో తీర్చిదిద్దిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఆయన సతీమణి వైఎస్ భారతిల చిత్రపటాన్ని సీఎంకు ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి బహూకరించారు. తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో గురువారం విద్యాశాఖ అధికారులు, విశ్వ విద్యాలయాల ఉపకులపతులతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమావేశమయ్యారు. కార్యక్రమం అనంతరం ఈ చిత్రపటాన్ని సీఎం జగన్‌కు వీసీ అందజేశారు. ఆరు రకాల సిరి ధాన్యాలు ఉపయోగించి ఈ చిత్రపటాన్ని రూపొందించినట్లు ముఖ్యమంత్రికి వీసీ వివరించారు.



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి సిరిధాన్యాలతో రూపొందించిన చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

సాక్షి, విశాఖపట్నం: అసైన్డ్ ల్యాండ్ పొందిన లబ్ధిదారులకు 20 ఏళ్ల తర్వాత పూర్తి హక్కులు కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై మేయర్ గొలగాని హరి వెంకట కుమారి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మద్దిలపాలెంలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు బోని శివరామకృష్ణ ఆధ్వర్యంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి ఆమె క్షీరాభిషేకం చేశారు. విశాఖ జోనల్ ఎస్సీ విభాగం ఇన్‌చార్జిలు అల్లంపల్లి రాజాబాబు, కంబాల సందీప్, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు అద్దాల కృపా జ్యోతి, బొండా ఉమామహేశ్వరరావు, పార్టీ సీనియర్ నాయకులు గొలగాని శ్రీనివాస్, చొక్కర శేఖర్, దాసరి రమేష్, నల్లా రవికుమార్, జార్జ్ నాని, పీలా ప్రేమ్‌కుమార్, పార్వతి తదితరులు పాల్గొన్నారు.



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మేయర్ హరి వెంకట కుమారి, నాయకులు

సీజనల్ వ్యాధుల కట్టడికి సన్నద్ధం కండి

- వార్డు శానిటరీ కార్యదర్శులకు జీవీఎంసీ కమిషనర్ ఆదేశం

డాబాగార్డెన్స్: మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా తదితర సీజనల్ వ్యాధుల కట్టడికి సన్నద్ధం కావాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ వార్డు శానిటరీ కార్యదర్శులను ఆదేశించారు. వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో సీజనల్ వ్యాధులపై గురువారం ఏర్పాటు చేసిన శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. వార్డు శానిటరీ కార్యదర్శులు సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ నెల నుంచి డిసెంబర్ వరకు దోమలు వృద్ధి చెందుతాయని.. తద్వారా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. అందుకే వారంలో ప్రతి మంగళ, శుక్రవారం వలంటీర్లు, కార్యదర్శులు, హెల్త్ అసిస్టెంట్లు, మలేరియా సిబ్బంది ఇంటింటికీ వెళ్లి.. దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆ ఇంటి పరిసరాల్లో ఎయిర్ కూలర్లు, డ్రమ్ములు, జాడీలు, కుండీలు, మనీప్లాంట్స్, టైర్లు, రిఫ్రిజిరేటర్లు, ఖాళీ సీసాలు, కొబ్బరి చిప్పల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. దోమలు వృద్ధి చెందే ప్రదేశాలను గుర్తించి తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఐఆర్ఎస్ స్ప్రేయింగ్, ఫాగింగ్, గంబోజి ఫిష్, ఆయిల్ బాల్స్, స్ప్రేయింగ్ ద్వారా దోమలను అరికట్టాలని ఆదేశించారు. అనంతరం జిల్లా మలేరియా అధికారి తులసి, జీవీఎంసీ బయాలజిస్ట్ సాంబమూర్తి శిక్షణను కొనసాగించారు. జిల్లా వైద్యాధికారి జగదీశ్వరరావు, జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

● సిటీలో నటి ప్రణీత సందడి



సినీ నటి ప్రణీత నగరంలో సందడి చేసింది. ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న ఆమెను చూసేందుకు అభిమానులు ఎగబడ్డారు.

ధరల నియంత్రణపై నేడు సమావేశం

సాక్షి, విశాఖపట్నం : మార్కెట్‌లో బియ్యం, కందిపప్పు ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు తక్కువ ధరకు విక్రయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలకు ఉపక్రమిస్తోంది. ఇప్పటికే రాష్ట్ర స్థాయి ట్రేడర్లతో సమావేశం నిర్వహించిన తరుణంలో జిల్లా స్థాయిలోనూ దీనిపై చర్చించేందుకు జేసీ కె.ఎస్.విశ్వనాథన్ ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం కానున్నారు. విశాఖ జిల్లా పరిధిలో 150 మంది బియ్యం హోల్‌సేల్ విక్రయదారులు, 45 మంది కందిపప్పు హోల్‌సేల్ ట్రేడర్లు ఉన్నారు. ఆయా అసోసియేషన్ ప్రతినిధులు, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి సూర్యప్రకాష్, ఇతర సివిల్‌సప్లై అధికారులతో జేసీ సమావేశం కానున్నారు. కందిపప్పు, బియ్యం విక్రయాల కోసం రైతు బజార్లలో ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. అయితే ట్రేడర్లు మాత్రం తమ దుకాణాల వద్దే తగ్గింపు ధరలకు సంబంధించి బ్యానర్లు ఏర్పాటు చేసి విక్రయిస్తామని అధికారులకు చెప్పినట్లు తెలుస్తోంది. దీని వల్ల విక్రయదారులకు రవాణా ఖర్చులు తగ్గడంతో పాటు వినియోగదారులకు అందుబాటులో దుకాణాలు ఉంటాయని భావిస్తున్నారు. శుక్రవారం జరిగే సమావేశం అనంతరం.. ఎంత మేర ధరలు తగ్గించి విక్రయిస్తారనే దానిపై జాయింట్ కలెక్టర్ నిర్ణయం తీసుకొని ప్రకటించనున్నారు.

చిన్నారి ప్రాణం తీసిన కుటుంబ కలహాలు

- తాటిపెండి వద్ద చిన్నారి మృతదేహం లభ్యం
- భార్య చంపేసిందంటూ భర్త పోలీసులకు ఫిర్యాదు



దినేష్ మృతదేహం

డెంకాడ/తగరపువలస: కుటుంబ కలహాలు అభంశుభం తెలియని మూడేళ్ల వయస్సున్న చిన్నారి నిండు ప్రాణాన్ని బలితీసుకున్నాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భీమునిపట్నం మండలంలోని దాకమర్రి పంచాయతీ అల్లుపేట గ్రామానికి చెందిన బొట్ట బంగారప్పుడు, అప్పమ్మలకు గణేష్, దినేష్(3) అనే ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. భార్యాభర్తల మధ్య చాలా కాలంగా వివాదం నడుస్తోంది. మూడు నెలల క్రితం అప్పమ్మ పిల్లలతో కలిసి అదే ఊరులో ఉంటున్న కన్నవారి ఇంటికి వచ్చేసింది. ఇటీవల గ్రామ పెద్దలు భార్యాభర్తల మధ్య సయోధ్య కుదర్చడంతో భర్త వద్దకు అప్పమ్మ వెళ్లింది. మళ్లీ వారి మధ్య గొడవ జరగడంతో ఇద్దరు పిల్లలను తీసుకుని ఇంటి నుంచి బుధవారం సాయంత్రం అప్పమ్మ బయటకు వెళ్లిపోయింది. అనంతరం ఆమె కనిపించలేదు. ఆమె కోసం కుటుంబ సభ్యులు వెతకసాగారు. ఈ దశలో మోదవలస పెట్రోల్‌బంకు సమీపంలో అప్పమ్మ, పెద్దకుమారుడు గణేష్‌తో గురువారం కనిపించింది. చిన్నకుమారుడు దినేష్ గురించి కుటుంబ సభ్యులు ప్రశ్నించారు. తోటల్లో వెతికారు. డెంకాడ మండలం మోదవలస పెట్రోల్ బంక్ సమీపంలోని తాటిపెండి వద్ద దినేష్ విగతజీవిగా కనిపించడంతో కన్నీరుమున్నీరుగా విలపించారు. చిన్నకుమారుడిని భార్యే చంపేసిందంటూ భర్త బంగారప్పుడు డెంకాడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భవిష్యత్ చదువులకు భరోసా

- ఒక్కో విద్యార్థికి రూ.10 వేల ప్రోత్సాహక బహుమతి
- చదువు పూర్తయ్యేంత వరకు స్కాలర్‌షిప్
- పాఠశాల స్థాయిలోనే పరిశోధనలకు ఊతమిస్తోన్న ప్రభుత్వం
- ఇన్‌స్పైర్ మనాక్ పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం





గత ఏడాది జరిగిన జిల్లా స్థాయి సైన్స్ పోటీల్లో విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులు

విశాఖ విద్య: ఒక ఐడియా విద్యార్థుల చదువులకు భరోసాగా నిలవనుంది. విద్యార్థి చెప్పిన ఆలోచన నిర్వాహకులకు నచ్చితే రూ.10 వేలు బహుమతి ఇస్తారు. ఆ డబ్బులతో తయారు చేసే సైన్స్ సంబంధిత ప్రాజెక్టుతో సదరు విద్యార్థి జాతీయ స్థాయి వరకు నిర్వహించే పోటీల్లో పాల్గొనవచ్చు. విద్యార్థి ప్రదర్శించిన ప్రాజెక్టు జాతీయ స్థాయిలో ఎంపికైతే బంపర్ బొనాంజా తగిలినట్లే. ఉన్నత చదువు పూర్తయ్యేంత వరకు స్కాలర్ షిప్ రూపేణా ప్రభుత్వం తోడ్పాటునందిస్తుంది. ఇంకెందుకు ఆలస్యం... ఇంతటి చక్కటి అరుదైన అవకాశాన్ని అందిపుచ్చుకోవాలనే ఆసక్తి ఉన్న విద్యార్థులు 'ఇన్‌స్పైర్ అవార్డ్స్ - మనాక్'లో ప్రాజెక్టుల సారాంశాన్ని ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి.

మేధోశక్తికి పదునుపెట్టేలా తోడ్పాటు

విజ్ఞాన, శాస్త్ర సాంకేతిక రంగాలపై పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు మక్కువ పెంచేలా ప్రభుత్వం ప్రత్యేక తోడ్పాటు అందిస్తోంది. ఈ నేపథ్యంలోనే 'ఇన్‌స్పైర్ అవార్డ్స్ మనాక్' పేరిట ఏటా రాష్ట్ర, జాతీయ స్థాయిలో పోటీలను నిర్వహిస్తూ, విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న మేధోశక్తికి పదును పెట్టేలా ప్రోత్సాహాన్ని అందిస్తోంది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డీఎస్‌టీ) ఆధ్వర్యంలో 2023–24 విద్యా సంవత్సరానికి 'ఇన్‌స్పైర్ అవార్డ్స్ -మనాక్' పేరిట సైన్స్ ప్రయోగాలకు విద్యార్థులను సిద్ధం చేస్తూ, వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

ఆలోచన చెబితే చాలు

సృజనాత్మకత, నూతనత్వంతో కూడిన పర్యావరణ హితమైన, సామాజిక, సమస్యలకు పరిష్కారం సూచించే విధంగా విద్యార్థులు తమ మేధోశక్తిని రంగరించి చక్కటి ఆలోచన చెబితే చాలు. దానిని డ్రాఫ్ట్ రూపంలో తీర్చిదిద్ది ఇన్‌స్పైర్ అవార్డ్స్ మనాక్ వెబ్‌సైట్‌లో www.inspireawards-dst.gov.in అప్‌లోడ్ చేయాలి. ఇదే సమయంలో విద్యార్థి పేరు, పాఠశాల యూడైస్ కోడ్, రెవెన్యూ డివిజన్, జిల్లా, విద్యార్థి బ్యాంకు అకౌంట్ నంబర్‌ను వెబ్‌సైట్‌లో పొందుపరచాలి.

ఎంపికైతే రూ.10 వేలు

జిల్లాలోని ప్రభుత్వ ఆధ్వర్యంలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలలతోపాటు, ప్రైవేటు విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులు సైతం ఇన్‌స్పైర్ అవార్డ్స్ కోసం తమ ఆలోచనలను పంపించవచ్చు. 6 నుంచి 10వ తరగతి వరకు, 10 నుంచి 15 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న వారు దీనికి అర్హులు. ప్రతీ పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. జిల్లా స్థాయిలో నియమితులైన కమిటీ విద్యార్థులు పంపించిన అంశాలను పరిశీలించి మంచి ఆలోచనలను ఎంపిక చేస్తారు. ఇలా ఎంపికైన విద్యార్థులకు రూ.10 వేలు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు.

విద్యార్థులకు ఎంతో ఉపయోగం



ఇన్‌స్పైర్‌లో ప్రాతినిధ్యం వహించే విద్యార్థులకు భవిష్యత్‌లో అనేక అవకాశాలు ఉన్నాయి. ఎక్కువ మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడం ద్వారా ప్రయోజనం చేకూరుతుంది. దీనిపై విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల డీఈవోలకు ఇప్పటికే కమిషనర్ నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. జిల్లా సైన్సు అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి.

– ఎల్.చంద్రకళ, డీఈవో, విశాఖ జిల్లా

ఎక్కువ మంది నమోదు చేసుకోవాలి



గతేడాది ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 2,328 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 203 మందికి రూ.10 వేలు చొప్పున మంజూరయ్యాయి. ఈ సారి ఇన్‌స్పైర్ అవార్డ్స్‌లో ఎక్కువ మంది విద్యార్థులు భాగస్వామ్యులయ్యేలా ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలి. దీనిపై అవగాహన సదస్సులను నిర్వహిస్తాం.

– కె.ప్రసాద్, జిల్లా సైన్స్ అధికారి, ఉమ్మడి విశాఖ జిల్లా



పాములను సందర్శకులకు చూపిస్తున్న కిరణ్

పాము.. 19 పిల్లలు

బీచ్‌రోడ్డు: తీరంలో నాగుపాము పిల్లల ప్రదర్శన ఆకట్టుకుంది. బుధవారం స్టీల్‌ప్లాంట్‌లో పట్టుకున్న నాగుపాము, దాని 19 పిల్లలను గురువారం ఆర్కేబీచ్ వద్ద స్నేక్ క్యాచర్ కిరణ్‌కుమార్ ప్రదర్శించారు. వాటిని తీరానికి వచ్చిన సందర్శకులు ఎంతో ఆసక్తిగా తిలకించారు.

ప్రతీ మొక్క ఆయన నేస్తమే..

ప్రేమగా స్పృశించాలే గానీ ప్రతీ ఆకు ప్రేమను పంచుతుంది.. ప్రతీ పుష్పం సుగంధంతో స్వాగతిస్తుంది.. ప్రతీ మొక్క ఆత్మీయంగా పలకరిస్తుంది.. సీతాకోక చిలుకలు రంగుల ప్రపంచాన్నే మన ముందు సృష్టిస్తాయి.. పక్షులు కిలకిలారావాలతో కబుర్లు చెబుతాయి.. అనే భావనతో.. ప్రకృతిపై ప్రేమతో.. మొక్కలతో ఉన్న బంధంతో ఓ ప్రకృతి ఆరాధకుడు నెలకొల్పిన బృందావనమే జీవ వైవిధ్య ఉద్యానవనం. వృత్తిరీత్యా జీవశాస్త్ర అధ్యాపకుడైన ఆయన కలలకు రూపంగా సాక్షాత్కరించింది. ఈ వనం వేలసంఖ్యలో అరుదైన మొక్కలు, 20 రకాలకు పైగా సీతాకోక చిలుకలు కొలువుదీరి, విద్యార్థులకు ప్రత్యక్ష ప్రయోగశాలగా నిలుస్తోంది. విద్యార్థులకు పుస్తకాలలో చదువుకున్న మొక్కలను ప్రత్యక్షంగా చూపిస్తూ వాటి విలువను, ప్రత్యేకతను వివరించే బృహత్ బాధ్యతను సైతం నిర్వహిస్తున్న ఆ వృక్ష సంరక్షకుడే డాక్టర్ మంథా రామమూర్తి.

- ఓ అధ్యాపకుడి కలల రూపం.. జీవ 'వైవిధ్య' ఉద్యాన 'వనం'
- వేలల్లో మొక్కలు, రంగుల సీతాకోక చిలుకలకు నిలయం



పార్కును సందర్శిస్తున్న విదేశీయులు(ఫైల్)

ఏయూక్యాంపస్: విద్యార్థిగా ఏయూలో చదువుకునే సమయంలో చుట్టూ ఉన్న ప్రకృతితో, పక్షులతో ఏర్పడిన విడదీయరాని అనుబంధం.. ఆ సమయంలో మనసులో నాటుకున్న చిన్న ఆలోచన అనంతర కాలంలో పెదవాల్తేరులోని జీవవైవిధ్య ఉద్యానవనం అభివృద్ధికి నాంది అయింది. అరుదైన వృక్షాలకు నెలవుగా.. వాటిపై ఆధారపడి జీవించే జీవజాతులకు నిలయంగా ఆ వనాన్ని తీర్చిదిద్దడంలో డాక్టర్ మంథా రామమూర్తి కృషి ప్రశంసనీయం. అక్కడి ప్రతీ మొక్క ఆయన నేస్తమే. బయాలజీ విద్యార్థులకైతే ఓ ప్రయోగశాలే అనిపించేంతగా అద్భుతంగా ఆ వనాన్ని తీర్చిదిద్దారు. నాలుగు దశాబ్దాల పాటు జీవశాస్త్ర అధ్యాపకుడిగా సేవలందించిన రామమూర్తి మొక్కలపై ఉన్న ఇష్టంతో తెలుగు రాష్ట్రాలలో ఎక్కడా లేని వైవిధ్య ఉద్యాన వనాన్ని సృష్టించారు. దాదాపు అరుదైన మొక్కలను సేకరించి నాలుగు ఎకరాల విస్తీర్ణంలో నాటి, సంరక్షిస్తున్నారు.

'ప్రకృతి'కి అంకితం

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జువాలజీ విభాగం నుంచి ఆచార్య కర్ర శ్రీనివాసరావు వద్ద మెరైన్ బయాలజీలో పీహెచ్‌డీని పూర్తి చేసిన అనంతరం మిసెస్ ఏవీఎన్ కళాశాలలో, బీవీకే కళాశాలలో అధ్యాపకునిగా సేవలందించి, 2013లో పదవీ విరమణ చేశారు. డాక్టర్ రామమూర్తి తన పీహెచ్‌డీ సిద్ధాంత గ్రంథాన్ని సైతం ప్రకృతి మాతకు అంకితం ఇచ్చారు.

1980లో తొలి అడుగు

భావి తరాలను ప్రకృతితో మమేకం చేస్తూ, సంరక్షణలో వారిని భాగస్వాములు చేయాలనే ఆశయంతో పెంగ్విన్ నేచర్ క్లబ్‌ను 1980లో ప్రారంభించారు. విద్యార్థుల సహాయంతో ద్వారకానగర్ పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటి, ఏడాది పాటు సంరక్షించే బాధ్యతను నిర్వహించారు. పాములను రక్షణ, సీతాకోక చిలుకల సంరక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం 2001లో డాల్ఫిన్ నేచర్ క్లబ్ ఎన్‌జీవోను స్థాపించారు. ఆయన భార్య, విశ్రాంత ఉపాధ్యాయిని మంగతాయి, పిల్లల సహకారంతో ప్రారంభమైన ఈ సంస్థ నేడు విస్తరించింది. 2002లో జీవ వైవిధ్య ఉద్యాన వనాన్ని తీర్చిదిద్దాలనే సంకల్పంతో ఎన్నో వ్యయప్రయాసలకోర్చి రాణి చంద్రమణి దేవి ఆసుపత్రిలో సుమారు నాలుగు ఎకరాల విస్తీర్ణంలో విభిన్న రకాల మొక్కలను నాటి, కంటికిరెప్పలా సంరక్షిస్తున్నారు. నేలపై, నీటిలో, చెట్లపై మనుగడ సాగించే మొక్కలు, అరుదైన కీటకాహార మొక్కలు, జురాసిక్‌ల కాలం నాటి మొక్కలు, నక్షత్ర వనం, రాశివనం, ఔషధ వనం, ఎడారి మొక్కలు ఇలా ఎన్నో మొక్కలు సందర్శకులను స్వాగతిస్తాయి.



విద్యార్థులకు ఉద్యానవనం విశేషాలు వివరిస్తున్న రామమూర్తి



అరుదైన ఆటోగ్రాఫ్ ట్రీ

ప్రత్యక్ష ప్రయోగశాలగా..

పార్కును నిత్యం వందలాది మంది పాఠశాల, కళాశాల విద్యార్థులు సందర్శిస్తుంటారు. ప్రతీ మొక్క వద్ద దానికి సంబంధించిన శాస్త్రీయ నామం, ప్రత్యేకతలు, ఔషధ విలువలు, మొక్క లభించే ప్రాంతం, దేశం వంటి వివరాలు ప్రత్యేకంగా బోర్డుల రూపంలో ఏర్పాటు చేశారు. వృక్షశాస్త్ర పరిశోధకులకు ఇది ఒక ప్రత్యక్ష ప్రయోగశాలగా నిలుస్తోంది. ఈ పార్క్‌లో పదుల సంఖ్యలో వైవిధ్యం కలిగిన సీతాకోక చిలుకలు, పక్షులు మనల్ని పలకరిస్తుంటాయి.



పార్క్‌లో అరుదైన మొక్కలను తిలకిస్తున్న విద్యార్థులు(ఫైల్)

యువత ముందుకు రావాలి

పుస్తకాలలో చదువుకున్న జ్ఞానాన్ని ప్రత్యక్షంగా విద్యార్థులకు చూపించాలనే ఉద్దేశంతో ఈ పార్కును ఏర్పాటు చేశాం. దీని నిర్వహణ బాధ్యతలను స్వీకరించడానికి యువత ముందుకు రావాలి. ప్రభుత్వ పరంగా ఇటువంటి జీవ వైవిధ్య ఉద్యానవనాలను పెంచే ప్రయత్నం చేయాలి. దీనికి అవసరమైన సంపూర్ణ సహకారం మేము అందించడానికి సిద్ధంగా ఉన్నాం.

–డాక్టర్ మంథా రామమూర్తి, పార్క్ నిర్వాహకులు

చేనేతకు చేయూతనివ్వండి

మేయర్ హరి వెంకట కుమారి పిలుపు



ఎగ్జిబిషన్‌లో వస్త్రాలను ప్రదర్శిస్తున్న మేయర్ హరివెంకట కుమారి

బీచ్‌రోడ్డు: భారతీయ సంస్కృతిలో సిల్క్, హ్యాండ్‌లూమ్ వస్త్ర ఉత్పత్తులకు ప్రత్యేక స్థానం ఉందని మేయర్ హరి వెంకట కుమారి అన్నారు. బీచ్‌రోడ్డులోని ద గేట్ వేలో ఏర్పాటు చేసిన కృతి వీవ్స్ అండ్ క్రాఫ్ట్స్ హ్యాండ్‌లూమ్ వస్త్ర ప్రదర్శనను గురువారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. చేనేత వస్త్రాలకు ఎప్పటికీ ఆదరణ ఉంటుందని, ఉత్పత్తుల తయారీ వెనుక చేనేత కార్మికుల శ్రమ దాగి ఉందన్నారు. ప్రతి ఒక్కరూ చేనేత ఉత్పత్తులను ఆదరించాలని, అప్పుడే కార్మికుల కష్టానికి ఫలితం దక్కుతుందన్నారు. నేటి యువత కూడా చేనేత ఉత్పత్తులను ఆదరిస్తుండటం సంతోషంగా ఉందన్నారు. నిర్వాహకురాలు శ్రీలత మాట్లాడుతూ ఈ నెల 18 వరకు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ ప్రదర్శన అందుబాటులో ఉంటుందన్నారు. దేశంలోని 14 నగరాల నుంచి చేనేత కార్మికులు సిద్ధం చేసిన 50 వేల వరకు సిల్క్, హ్యాండ్‌లూమ్ చీరలు, డ్రెస్ మెటీరియల్ వంటి ఉత్పత్తులను ఇక్కడ ప్రదర్శించినట్లు చెప్పారు.

భయపెట్టిన కొండచిలువ

మల్కాపురం: జింక్ ప్రాంతంలో గురువారం ఉదయం కొండచిలువ వాకర్స్‌ను భయపెట్టింది. ఈ మార్గంలో పలువురు వాకింగ్ చేస్తుండగా.. కొండచిలువ రోడ్డుపైకి రావడంతో భయాందోళన చెందారు. సమాచారం అందుకున్న స్నేక్ క్యాచర్ నాగరాజు అక్కడకు చేరుకుని.. 8 అడుగుల కొండచిలువను పట్టుకున్నారు. దానిని కొండ ప్రాంతంలో విడిచిపెట్టారు.



కొండచిలువతో నాగారాజు

క్రైమ్ థ్రిల్లర్‌గా కొత్త చిత్రం



మాట్లాడుతున్న నిర్మాత శ్రీనివాసరావు

బీచ్‌రోడ్డు: క్రైమ్ థ్రిల్లర్ కథతో త్వరలో ప్రొడక్షన్ నంబర్ వన్‌గా ఓ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు నిర్మాత వంగా శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు చిత్ర యూనిట్ గురువారం మీడియా సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముంబయి నటుడు జాన్ రీగన్, హీరోయిన్ రేఖాబోజ్ జంటగా ఈ చిత్రం షూటింగ్‌ను ఆగస్టులో ప్రారంభిస్తామన్నారు. విశాఖపట్నంలోనే ఎక్కువ భాగం చిత్రీకరిస్తామని వెల్లడించారు. హీరో జాన్ రీగన్ మాట్లాడుతూ తన మొదటి తెలుగు సినిమా క్రైం అండ్ థ్రిల్లర్ కథ కావడం సంతోషంగా ఉందన్నారు. తెలుగు నేర్చుకుని టాలీవుడ్‌లో మరిన్ని చిత్రాల్లో నటించాలని ఉందన్నారు. ఈ చిత్రానికి దర్శకత్వం ప్రదీప్ చంద్ర, డీవోపీ ఆశిష్, సంగీతం జాన్ కెన్నెడీ అందిస్తున్నారు.

'స్లమ్ డాగ్ హస్బెండ్' నవ్విస్తాడు

హీరో సంజయ్ రావు

బీచ్‌రోడ్డు: స్లమ్ డాగ్ హస్బెండ్ చిత్రం ప్రేక్షకులు చూస్తున్నంత సేపు నవ్వుతూ.. ఎంతో ఎంజాయ్ చేస్తారని ఆ సినిమా హీరో సంజయ్‌రావు అన్నారు. 'స్లమ్ డాగ్ హస్బెండ్'ప్రమోషన్‌లో భాగంగా గురువారం బీచ్‌రోడ్‌లో సినిమా బృందం సందడి చేసింది. ఈ సందర్భంగా హీరో సంజయ్ మాట్లాడుతూ ఈ సినిమాలో హీరోకు జాతకాలంటే ఎంతో విశ్వాసం అని.. జాతకంలో దోషం ఉండటంతో చెట్టు లేదా కుక్కను వివాహం చేసుకోమని ఓ జ్యోతిష్యుడు చెబుతాడన్నారు. దీంతో హీరో కుక్కను వివాహం చేసుకుంటాడని, అక్కడి నుంచి కథ ఎన్నో మలుపులు తిరుగుతుందన్నారు. హీరోయిన్ ప్రణవి మాట్లాడుతూ తాను స్లమ్‌లో నివసించే మౌనిక అనే పాత్రలో నటించినట్లు చెప్పారు. ఈ నెల 21న ఈ సినిమా విడుదలవుతుందని, తెలుగు ప్రేక్షకులందరూ ఆదరించాలని కోరారు. హాస్యనటుడు యాదమరాజు మాట్లాడుతూ ఈ చిత్రంలో సప్తగిరి, తన కామెడీ అద్భుతంగా ఉంటుందన్నారు. ఈ చిత్రానికి ఎ.ఆర్.శ్రీధర్ దర్శకత్వం వహించగా.. అప్పిరెడ్డి నిర్మాతగా వ్యవహరించారు. అనంతరం చిత్ర యూనిట్ ఓ ప్రైవేట్ కళాశాలలో సందడి చేసింది.

ఆకట్టుకుంటున్న నేషనల్ సిల్క్ ఎక్స్‌పో



సందర్శకులతో సిల్క్ ఎక్స్‌పో

బీచ్‌రోడ్డు: బీచ్‌రోడ్డులోని నోవాటెల్‌లో ఏర్పాటు చేసిన నేషనల్ సిల్క్ ఎక్స్‌పోకు నగరవాసుల నుంచి విశేష స్పందన లభిస్తోందని నిర్వాహకులు తెలిపారు. గురువారం నుంచి ప్రారంభించిన ఈ ఎక్స్‌పోలో వస్త్రాలు, ఆభరణాలు సందర్శకుల ఆకట్టుకుంటున్నాయన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో మగ్గంపై రూపొందించిన వస్త్రాలను ఒకే చోట అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. వస్త్రాలపై 50 శాతం వరకు తగ్గింపు ధరలకు అమ్మకాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఎక్స్‌పో 17వ తేదీ వరకు ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు సందర్శకులకు అందుబాటులో ఉంటుందన్నారు.

రక్తహీనతపై అవగాహన

బస్సు యాత్ర ప్రారంభించిన నటి ప్రణీత



బస్సు యాత్ర ప్రారంభిస్తున్న సినీ నటి ప్రణీత

బీచ్‌రోడ్డు: రక్తహీనతతో బాధపడుతున్న వారికి అవగాహన కల్పించేందుకు ద ఫెడరేషన్ ఆఫ్ అబ్‌స్ట్రెట్రిక్ అండ్ గైనకాలజికల్ సొసైటీస్ ఆఫ్ ఇండియా(ఫాగ్సి), పీ అండ్ జీ హెల్త్ సంయుక్తంగా 'నా నా ఎనీమియా(రక్తహీనత వద్దు)' పేరుతో బస్సు యాత్ర ప్రారంభించాయి. ఈ యాత్రను గురువారం బీచ్‌రోడ్డులోని ఓ హోటల్‌లో సినీనటి ప్రణీత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను కూడా గర్భం దాల్చినప్పుడు రక్తహీనత సమస్యతో బాధపడినట్లు తెలిపారు. ముఖ్యంగా చిన్న పిల్లలు, గర్భిణులు రక్తహీనతతో బాధపడుతుంటారని, వారికి అవగాహన కల్పించాలనే లక్ష్యంతో బస్సు యాత్ర నిర్వహించడం అభినందనీయమన్నారు. ఫాగ్సి అధ్యక్షుడు డాక్టర్ హృషికేష్ పాయ్ మాట్లాడుతూ గతేడాది ఐదు రాష్ట్రాల్లో బస్సు యాత్ర నిర్వహించామని.. ఈ యాత్రకు విశేష స్పందన లభించిందన్నారు. అదే స్ఫూర్తితో ఈ ఏడాది దక్షిణాది రాష్ట్రాల్లోని 21 నగరాల మీదుగా 90 రోజుల పాటు యాత్ర కొనసాగుతుందన్నారు. ఈ యాత్రలో ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు 2వేల మందికి రక్త పరీక్షలు నిర్వహించి తమ సొసైటీ వైద్యుల ద్వారా వారికి సూచనలిస్తామన్నారు. కార్యక్రమంలో పీ అండ్ జీ హెల్త్ ఎండీ మిలింద్ థాటే తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై డ్రిప్ పరికరాలు, స్ప్రింకర్లు

మహారాణిపేట: రైతులకు రాయితీపై సూక్ష్మ సేద్యం పరికరాలు అందజేస్తున్నట్లు ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు(ఏపీఎంఐపీ) డైరెక్టర్ ఎం.ఎ.రహీం తెలిపారు. ఐదు ఎకరాల్లోపు భూమి గల రైతులకు 90 శాతం రాయితీ, ఐదు ఎకరాలు పైబడి భూమి గల రైతులకు 50 శాతం రాయితీపై డ్రిప్ పరికరాలు అందజేస్తామన్నారు. అలాగే ఐదు ఎకరాల భూమి గల రైతులకు 55 శాతం రాయితీ, ఐదు ఎకరాల పైబడి భూమి గల రైతులకు 45 శాతం రాయితీపై స్ప్రింకర్ సెట్‌లు అందిస్తామన్నారు. బోరు బావి ఉన్న ప్రతీ రైతు తక్కువ నీటితో, అధిక దిగుబడి, నాణ్యమైన ఉత్పత్తి సాధించాలనుకుంటే సూక్ష్మ సేద్యం పరికరాలు వినియోగించుకోవాలని సూచించారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 300 హెక్టర్లలో సూక్ష్మసేద్యం చేయాలనే లక్ష్యం నిర్దేశించుకున్నట్లు చెప్పారు. రైతులు ఆధార్ జిరాక్స్, సాగు భూమి 1బీ, బ్యాంక్ పాస్ బుక్ కాపీ, ఫోన్ నంబర్ తదితర వివరాలతో రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఏడేళ్ల కిందట రాయితీపై డ్రిప్ పరికరాలు తీసుకున్న రైతులు.. ఈ ఏడాది కూడా పరికరాలు పొందవచ్చని వివరించారు.

లారీ డ్రైవర్‌కు ఏడాది జైలు

అక్కిరెడ్డిపాలెం: రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతికి కారణమైన లారీ డ్రైవర్‌కు జైలు, జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. గాజువాక ఎస్ఐ కొల్లి సతీష్ తెలిపిన వివరాలివీ.. 2017 సెప్టెంబర్ 26న గాజువాక పోలీస్‌స్టేషన్ ఎదురుగా సిగ్నల్ పాయింట్ మీదుగా బైక్‌పై బోయిడాపు లక్ష్మణరావు ప్రయాణిస్తున్నాడు. అదే సమయంలో వల్లపుదాసు నూకరాజు లారీతో బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో లక్ష్మణరావు అక్కడికక్కడే మృతి చెందాడు. అతని భార్య మీనాక్షి ఫిర్యాదు మేరకు ఎస్ఐ కొల్లి సతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తు చార్జ్‌షీట్‌ను కోర్టుకు దాఖలు చేశారు. ఈ కేసుకు సంబంధించి ఏపీపీ వాణి వాదనలు విన్న గాజువాక మూడవ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ రాజేంద్ర బాబు.. నూకరాజుకు ఏడాది జైలు, రూ.లక్ష జరిమానా విధించారు.

ఎండీయూ వాహనాలతోనే పుస్తకాల సరఫరా

విశాఖ విద్య: ప్రభుత్వ పాఠశాలలకు రెండో సెమిస్టర్ పుస్తకాల సరఫరాకు అంతా సిద్ధం చేసినట్లు డీఈఓ ఎల్.చంద్రకళ తెలిపారు. గురువారం తన చాంబర్‌లో డీఎస్ఓ సూర్యప్రకాశరావుతో కలిసి జిల్లాలోని ఎంఈవోలు, ఎండీయూ సిబ్బందితో కలిసి పుస్తకాల సరఫరాపై తీసుకోవలసిన చర్యపై సమీక్షించారు. జిల్లాలోని 11 మండలాల్లో గల 126 పాఠశాలల విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా రెండో సెమిస్టర్ పాఠ్య పుస్తకాలు 2,53,696 సిద్ధంగా ఉన్నాయన్నారు. వీటిని మండల కేంద్రాల నుంచి పాఠశాలలకు నేరుగా సరఫరా చేసేందుకు ఎండీయూ వాహనాలను వినియోగించుకునేలా ఉన్నతాధికారులు ఆదేశించటం జరిగిందన్నారు. రవాణా చార్జీలను ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. జిల్లాలో ఏఏ మండలాలకు ఎన్ని పాఠ్యపుస్తకాలను సరఫరా చేయాలి? ఇందుకు ఎన్ని ఎండీయూ వాహనాల అవసరమనేది డీఎస్‌వో సూర్యప్రకాశరావు వివరించారు.

15న బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

మధురవాడ: అంతర్ జిల్లాల సబ్ జూనియర్ బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ పాల్గొనే జిల్లా జట్ల ఎంపిక ఈ నెల 15న నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సునీల్ మహంతి, జి.భూషణరావు చెప్పారు. జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోలీస్ బ్యారెక్స్‌లోని బాస్కెట్‌బాల్ గ్రౌండ్‌లో సాయంత్రం 4 గంటల నుంచి పోటీలు జరుగుతాయన్నారు. 1 జనవరి 2010 తర్వాత పుట్టినవారు మాత్రమే అర్హులని చెప్పారు. ఆసక్తి గల బాలబాలికలు ఆధార్ కార్డు, పుట్టి తేదీ సర్టిఫికెట్‌లతో హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు 89196 49048, 99667 53209 నెంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

లిఫ్టర్ పల్లవికి స్వర్ణం

విశాఖ స్పోర్ట్స్: కామన్‌వెల్త్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో నగర వెయిట్‌లిఫ్టర్ స్వర్ణాన్ని సాధించింది. ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో గురువారం జరిగిన 64 కేజీల వెయిట్ కేటగిరిలో పల్లవి సత్తాచాటింది. ఈ పోటీలు 16వ తేదీ వరకు జరగనుండగా స్థానిక కోచ్ సూర్యనారాయణ ఈ పోటీల్లో టెక్నికల్ ఆఫీషియల్‌గా సేవలందిస్తున్నారు.